మార్మోగిన అయ్యప్ప శరణుఘోష

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్‌లోని కొండపైనున్న హరిహరసుత అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం మకర సంక్రమణాన్ని పురస్కరించుకొని విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అయ్యప్పనామ సంకీర్తనతో ఏకాహం నిర్వహించి, స్వామికి పంచామృతాలతో అభిషేకాన్ని బాబు గురుస్వామి నిర్వహించారు. అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. సాయంత్రం స్వామిసన్నిధి ఎదురుగా కర్పూర మకర జ్యోతిని వెలిగించారు. సీతారామాచంద్రస్వామి ఆలయం వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి అర్చకులు రాజేంద్రశర్మ విశేష పూజలు చేశారు. అనంతరం మకర సంక్రమణ సమయంలో కర్పూర జ్యోతిని వెలిగించారు.

వాడవాడలా భోగి మంటలు





తాడేపల్లి బొమ్మల సెంటర్ వద్ద భోగి మంటలు వేస్తున్న స్థానికులు, శ్రీమద్విరాంజనేయ స్వామి దేవస్థానం ముందు భోగిమంటలు వేస్తున్న ఆలయ అర్చకులు

తాడేపల్లి రూరల్: మకర సంక్రాంతికి ముందు వచ్చే భోగి పండుగను పురస్కరించుకుని శనివారం తెల్లవారుజామున నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో స్థానికులు భోగి మంటలను వేశారు. దుగ్గిరాల మండల పరిధిలోను, ఎంటీఎంసీ పరిధిలోను వాడవాడలా నివాసాల్లో ఉన్న పాత చెక్కముక్కలు, ఇతర సామగ్రిని బయట పడవేసి సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి భోగి మంటలు వేశారు. భోగి మంటల వద్ద నీటిని కాచుకుని స్నానాదులు ముగించుకుని అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం చిన్నారులకు భోగి పళ్లు పోసి భోగి శుభాకాంక్షలు అందించారు.

శ్రీమద్విరాంజనేయస్వామి దేవస్థానంలో...

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని సీతానగరం శ్రీమద్విరాంజనేస్వామి దేవస్థానంలో శనివారం భోగి మంటలు వేశారు. సంప్రదాయ బద్ధంగా ఆవు పిడకలు, కర్రలతో భోగిమంట వేసి చుట్టూ పూలు అలకరించారు. అనంతరం ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, సత్యకుమార్, సుప్రకాష్, శ్రీనివాసరెడ్డి, పూర్ణ, నారాయణ, పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేత



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు శనివారం బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ నాయకులు దర్శి విజయశ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రహ్మనందపురం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, పండుగ సమయంలో యువతకు క్రికెట్ పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయడం ఎంతో ఆనందించదగ్గ విషయమని అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ దర్శి రమేష్, కర్రి రోహిత్ పాల్గొన్నారు.

ఘనంగా ఎఫ్‌సీఐ వ్యవస్థాపక దినోత్సవం

తాడేపల్లి రూరల్: భారత ఆహార సంస్థ(ఎఫ్‌సిఐ) 59వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎఫ్‌సీఐ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ జోషి ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆహార పరిపుష్టి దిశగా భారతదేశాన్ని తీసుకువెళ్లడంలో ఎఫ్‌సీఐ కృషి ఎంతో ఉందని అన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీజీఎం ఆశిక్ టక్, డివిజనల్‌మేనేజర్ దుశ్యంత్, ఏజీఎం క్యూసీలు మనోజ్‌కుమార్, రాఘవేందర్ సింగ్ పాల్గొన్నారు.

పాస్టర్‌కు ఆర్థిక సహాయం

తాడేపల్లి రూరల్: కార్పొరేషన్ పరిధిలోని నవులూరుకు చెందిన ఓ పాస్టర్ ప్రమాదానికి గుర్త్తె గాయపడడంతో శనివారం మెట్రో రీజియన్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆర్గనైజింగ్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. నవులూరుకు చెందిన పాస్టర్ నంబూరు శాంసన్ ఇటీవల లిఫ్ట్ ప్రమాదంలో కాళ్లకు తీవ్ర గాయాలై నడవలేని పరిస్థితిలో ఉన్నారు. ఆయనకు మంగళగిరి మెట్రో రీజియన్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ పాస్టర్ రవి ప్రకాష్ ఆధ్వర్యంలో 5 వేల రూపాయల నగదు, నిత్యావసరాలు అందజేశారు. పాస్టర్లు బేతాళ సాల్మన్ రాజు, నందూరి బాలస్వామి, వనమా యేసుబాబు, పులి భాస్కరరావు, ప్రశాంత్ రాజు, దారా మార్కు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

మంగళగిరి(తాడేపల్లి రూరల్): మంగళగిరి పట్టణ పరిధిలోని కొత్తపేటలో ఎస్‌ఈబీ పోలీసులు శనివారం నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఎస్ఈబీ ఎస్ఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాలు.. మంగళగిరి కొత్తపేట బావి సెంటర్ సమీపంలో నాన్ డ్యూటీ (తెలంగాణ)కు చెందిన మద్యాన్ని కె.కిరణ్‌బాబు అమ్ముతున్నాడని సమాచారం రావడంతో తమ సిబ్బందితో కలసి దాడి చేసినట్లు చెప్పారు. కిరణ్‌బాబు వద్ద నుంచి 30 మద్యం సీసాలు, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

తాడికొండ మార్కెట్ యార్డుకు పర్సన్ ఇన్‌చార్జి నియామకం

తాడికొండ: స్థానిక మార్కెట్ యార్డుకు పర్సన్ ఇన్‌చార్జిగా మార్కెటింగ్ శాఖ ఉప సంచాలకులు జాన్సీరాణి నియమిస్తూ మార్కెటింగ్ శాఖ ఉప సంచాలకులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో పాలక వర్గం నియమిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను నిలుపుదల చేస్తూ జీఓ నంబర్ 45 ద్వారా ఉత్తర్వులు జారీ చేసినట్లు ఉపసంచాలకులు తెలిపారు.

కారు బోల్తాపడి ఇద్దరికి గాయాలు

మేడికొండూరు: వేగంగా వెళుతున్న కారు అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని కొర్రపాడు సమీపంలో శనివారం చోటుచేసుకుంది. పల్నాడు జిల్లా, రాజుపాలెం మండలం అనుపాలెం గ్రామానికి చెందిన మస్తాన్, మిత్రుడు సైదా ఇద్దరు కలసి కారులో విజయవాడ బయల్దేరారు. ఎదురుగా వస్తున్న వాహనాలు తప్పించే క్రమంలో కారు అదుపు తప్పి పక్కన ఉన్న పొలాల్లోకి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో మస్తాన్, సైదా ఇద్దరికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను 108లో ఆస్పత్రికి తరలించారు. మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పవన్ కల్యాణ్ సభ్యతతో మాట్లాడాలి

తాడేపల్లి రూరల్(దుగ్గిరాల): జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సభ్యత, సంస్కారంతో మాట్లాడాలని వైఎస్సార్ సీపీ దుగ్గిరాల మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. శనివారం దుగ్గిరాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిని అసభ్యంగా, అభ్యంతరకర పదజాలంతో మాట్లాడడం పవన్ కళ్యాణ్‌కు సరికాదని అన్నారు.

పల్లెల్లో సంక్రాంతి సందడి

తాడికొండ: సంక్రాంతి వేడుకలకు పల్లెలు సిద్ధమయ్యాయి. శనివారం వేకువజామునే భోగి మంటలతో ప్రారంభమైన సంక్రాంతి వేడుకలు కొత్త అలంకరణ ముగ్గులతో లోగిళ్ల స్వాగతం పలుకుతున్నాయి. ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉండటంతో రైతులు ఆనందోత్సాహాల నడుమ వేడుకలు నిర్వహిస్తున్నారు.

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

ఎమ్మెల్యే ఆర్కే



తాడేపల్లి రూరల్: ప్రజలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను పురస్కరించుకుని ప్రజలకు, అధికారులకు, వైఎస్సార్ సీపీ నేతలకు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగ సంక్రాంతి అని, నియోజకవర్గ ప్రజలందరూ సంతోషంగా మూడు రోజుల పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ప్రతి ఇంటా సంక్రాంతి కాంతులు
ఉండవల్లి శ్రీదేవి, ఎమ్మెల్యే, తాడికొండ



తాడికొండ: ప్రతి ఇంటా సంక్రాంతి కాంతులు వెల్లివిరియాలని, తెలుగింటి పెద్ద పండుగ సంక్రాంతిని ఆనందోత్సాహాలతో ఇంటింటా జరుపుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి తెలిపారు. సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి పండుగ భావితరాలకు మన సంప్రదాయాలను అందించేలా నిర్వహించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతి ఇంటా సంక్రాంతి సిరులు
పార్టీ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్



తాడికొండ: ప్రజలకు భోగి, భోగ భాగ్యాలు, సంక్రాంతి సిరులు, కనుమ కాంతులు ప్రతి ఇంటా కురవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ ఆకాంక్షించారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో పండుగ జరుపుకోవాలని కోరారు. సంక్రాంతి శుభాకాంక్షలు అందజేశారు.

ఆనందాల సంక్రాంతి
కమిషనర్ శారదాదేవి



తాడేపల్లి రూరల్: భోగి మంటలు మీ జీవితంలోని భోగభాగ్యాలతో నింపాలని, ఈ సంక్రాంతి సకల సిరులతో సరికొత్త వెలుగులు తీసుకురావాలని కనుమ పండుగ కమనీయమైన ఆనందాలను కలుగజేయాలని కోరుకుంటున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ యు.శారదాదేవి తెలిపారు.

వైభవంగా సంక్రాంతి బొమ్మల కొలువు

తాడేపల్లి రూరల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పలుచోట్ల శనివారం భక్తిశ్రద్ధలతో సంక్రాంతి బొమ్మల కొలువులు నిర్వహించారు. మహిళలు సంప్రదాయబద్ధంగా మెట్ల బల్లపై బొమ్మలు అమర్చి పిల్లలను, ముత్తయిదువులను పిలిచి పూజలు జరిపి ముత్తయిదువులకు పసుపు, కుంకుమ, తాంబూలాలను అందజేశారు. ఈ బొమ్మల కొలువును మూడురోజులపాటు నిర్వహిస్తారు.

సంప్రదాయ పోటీలు నిర్వహించడం అభినందనీయం

ఫిరంగిపురం: సంప్రదాయ పోటీలు నిర్వహించడం ద్వారా గ్రామాల్లో ఆరోగ్యకరమైన వాతావరణం ఉంటుందని వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీ నాయకుడు సయ్యద్ హబీబుల్లా అన్నారు. మండలంలోని వేములూరిపాడు గ్రామంలోని వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద గుండురాయి ఎత్తు పోటీలు శనివారం సాయంత్రం నిర్వహించారు. పోటీలను సయ్యద్ హబీబుల్లా, అమీనాబాద్ గ్రామ పంచాయతీ అభివృద్ధి కమిటీ చైర్మన్ కొరివి ఆనంద్, మండల కోఆప్షన్ మెంబర్ షేక్ సుభానీలు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. 102 కేజీల గుండురాయిని ఐదు నిమిషాల వ్యవధిలో ఎన్నిసార్లు ఎత్తి పడవేస్తారో వారు విజేతగా నిలుస్తారని న్యాయనిర్ణేతలు భీమనాథుని చలపతిరావు, సయ్యద్ సైదా ప్రకటించారు. పల్నాడు జిల్లా పమిడి గ్రామానికి చెందిన వీరాంజనేయులు నాలుగు నిమిషాల వ్యవధిలో గుండరాయిని 25 సార్లు ఎత్తి పడవేసి ప్రథమ బహుమతి విజేతగా నిలిచారు. ద్వితీయ బహుమతి విజేతగా నరేంద్ర ఐదు నిమిషాల వ్యవధిలో 21 సార్లు, తృతీయ బహుమతి విజేతగా నాగరాజు 13 సార్లు వేశారు. ప్రథమ బహుమతిని గ్రామానికి చెందిన సయ్యద్‌బహుదూర్‌సాహెబ్, ఆషిరిపుల్‌ల జ్ఞాపకార్థం రూ.5,116 అందజేశారు. ద్వితీయ బహుమతిగా రూ.3,116, తృతీయ బహుమతిగా రూ.2,116 విజేతలకు అందజేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

తాడేపల్లి రూరల్: కార్పొరేషన్ పరిధిలోని నవులూరు పుట్టరోడ్డులోని శ్రీఫణీంద్ర విద్యానికేతన్ ఆవరణలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ వ్యవస్థాపకురాలు అన్నప్రగడ భవానీ మాట్లాడుతూ 1987 కాలంలో నవులూరు ప్రాంతంలో పిల్లలు విద్యకు చాలామంది దూరంగా ఉన్నారని, ఆ కారణంగా శ్రీ ఫణీంద్ర విద్యానికేతన్‌ను ఏర్పాటు చేశామని అన్నారు. సుమారు 700 మంది వరకు పూర్వ విద్యార్థులు పాల్గొని తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అనంతరం అన్నప్రగడ భవానీ రామకృష్ణ దంపతులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు అన్నప్రగడ రమణ, పీటీ కోచ్ సత్యనారాయణ, పూర్వ విద్యార్థులు బత్తుల సాంబశివరావు, షేక్ ఖలీల్, ఖాజా వలి, బాజీఖాన్, రాజేష్, గోపీ, కృష్ణ, తాయిబాబు పాల్గొన్నారు.

సెయింట్‌పాల్స్ హైస్కూల్‌లో...

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సెయింట్‌పాల్స్ హైస్కూల్ ఆడిటోరియంలో 2003–2008 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం నిర్వహించారు. ఇదే పాఠశాలలో చదివి పలు ప్రాంతాల్లో అనేక రంగాల్లో స్థిర పడిన పూర్వ విద్యార్థులు వచ్చి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. తాము చేసిన చిలిపిపనులు, మధురానుభూతులను జ్ఞాపకం తెచ్చుకొన్నారు.